# నమస్తే తెలంగాణ

# భద్రాద్రి కొత్తగూడెం

5 | ఖమ్మం, ఆదివారం 6 ఏప్రిల్ 2025 | BHADRADRI KOTHAGUDEM




సన్నాహక సమావేశం అనంతరం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తో పార్టీ ఉమ్మడి ఖమ్మం జిల్లా నేతలు వద్దిరాజు, అజయ్, రేగా, సండ్ర, కందాళ, వనమా, హరిప్రియ, మెచ్చా, మదన్‌లాల్, కమల్‌రాజు

- పార్టీ వేడుకల సన్నాహక సమావేశంలో అధినేత కేసీఆర్
- 'మహాసభ'పై ఉమ్మడి ఖమ్మం జిల్లా నేతలకు దిశానిర్దేశం

## బీఆర్ఎస్ రజతోత్సవాల్లో.. అన్ని వర్గాల ప్రజలనూ భాగం చేయండి

ఈ నెల 27న వరంగల్‌లో నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవంలో అన్ని వర్గాల ప్రజలనూ భాగస్వాములను చేయాలని పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పిలుపునిచ్చారు. రజతోత్సవ మహాసభ సంబురాలను జయప్రదం చేయాలని కోరారు. రజతోత్సవాల విజయవంతం కోసం ఎర్రవల్లిలోని తన వ్యవసాయ క్షేత్రంలో బీఆర్ఎస్ ఉమ్మడి ఖమ్మం జిల్లా నేతలతో శనివారం నిర్వహించిన సన్నాహక సమావేశంలో వారికి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రజతోత్సవంలో పార్టీ శ్రేణులు ముందు భాగాన నిలిచి అన్ని వర్గాల ప్రజలను, ముఖ్యంగా రైతులను సంబురాల్లో భాగం చేయాలని సూచించారు. రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు, ఖమ్మం జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు, మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, వనమా వెంకటేశ్వరరావు, కందాళ ఉపేందర్‌రెడ్డి, హరిప్రియ, మెచ్చా నాగేశ్వరరావు, బానోత్ మదన్‌లాల్ పాల్గొన్నారు. **-నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, ఏప్రిల్ 5**

## అన్ని వార్డులు, పంచాయతీల్లో బీఆర్ఎస్ జెండా ఎగురవేయాలి

**భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు**



మణుగూరు టౌన్, ఏప్రిల్ 5: వరంగల్‌లో ఈ నెల 27వ తేదీన జరగబోయే బీఆర్ఎస్ ఆవిర్భావ రజతోత్సవ మహాసభకు ముందుగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అన్ని పంచాయతీలు, వార్డుల్లో పార్టీ జెండాలు ఎగురవేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు శనివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఈ నెల 7 నుంచి 25వ తేదీలోపు అన్ని వార్డులు, పంచాయతీల్లో జెండా దిమ్మెలు ఏర్పాటు చేసుకొని పండుగ వాతావరణంలో జెండా ఆవిష్కరణలు చేసుకోవాలని పార్టీ శ్రేణులను కోరారు. పార్టీ మండల అధ్యక్షులు పంచాయతీల్లోని కార్యకర్తలను సమన్వయం చేసుకొని ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని సూచించారు.

## కల్యాణ వైభోగమే..

- భద్రాచలం పట్టణంలో నేడు సీతారాముల కల్యాణం
- మిథిలా స్టేడియంలో ఏర్పాట్లు పూర్తి
- ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలు సమర్పించనున్న సీఎం
- హాజరుకానున్న మంత్రులు, హైకోర్టు న్యాయమూర్తులు
- రేపు శ్రీరామ మహా పట్టాభిషేకం



మిథిలా స్టేడియంలో సిద్ధమైన షామియానాలు

భద్రాచలం, ఏప్రిల్ 5: భద్రాచల క్షేత్రంలో ఆదివారం జరుగనున్న మహా ఘట్టానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. రాములోరు సీతమ్మను పరిణయమాడే ఆ శుభ ముహూర్తం వచ్చేసింది. భద్రాచలంలో ఆదివారం ఈ మహాద్భుత దృశ్యాన్ని వీక్షించేందుకు తెలుగు రాష్ట్రాలతోపాటు దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు తరలివచ్చారు. కల్యాణం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దంపతులు సమర్పించనున్నారు. జగత్కల్యాణాన్ని తిలకించేందుకు పలువురు మంత్రులు, హైకోర్టు న్యాయమూర్తులు కూడా హాజరుకానున్నారు.

**10:30 గంటలకు తిరు కల్యాణ మహోత్సవం..**

శ్రీరామనవమి సందర్భంగా రామాలయాన్ని విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించారు. అలాగే, మిథిలా స్టేడియంలో శిల్పకళా శోభితమైన కల్యాణ మండపాన్ని అద్భుతంగా అలంకరించారు. ఎండ, ఉక్కపోతతో భక్తులు ఇబ్బందులు పడకుండా స్టేడియంలో 100 టన్నుల ఏసీతోపాటు, వంద కూలర్లు, 250 ఫ్యాన్లు ఏర్పాటు చేశారు. ఆదివారం ఉదయం 10:30 గంటలకు తిరు కల్యాణ మహోత్సవం ప్రారంభమవుతుంది. కల్యాణ వేడుకలో భాగంగా శనివారం రాత్రి ఎదుర్కోలు ఉత్సవం సంప్రదాయబద్ధంగా సాగింది. కల్యాణ మహోత్సవానికి వచ్చే భక్తుల కోసం మూడు లక్షల లడ్డూలను దేవస్థానం అధికారులు సిద్ధం చేశారు. వీటిని 28 కౌంటర్ల ద్వారా భక్తులకు విక్రయించనున్నారు. అలాగే, మిథిలా స్టేడియంలో సోమవారం శ్రీరామ మహాపట్టాభిషేకాన్ని నిర్వహించనున్నారు. పట్టాభిషేకాన్ని తిలకించేందుకు రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రభుత్వం తరపున హాజరుకానున్నారు. అలాగే, పట్టువస్త్రాలూ సమర్పించనున్నారు. స్వామి వారి కల్యాణం, పట్టాభిషేకం వేడుకలను తిలకించేందుకు భద్రాద్రికి తరలివచ్చే భక్తుల కోసం చేస్తున్న ఏర్పాట్లపై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. కల్యాణం సందర్భంగా ఎస్పీ రోహిత్‌రాజు ఆధ్వర్యంలో 1,800 మంది పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు.

## అలరించిన 'ఎదుర్కోలు ఉత్సవం'



ఎదుర్కోలు ఉత్సవంలో గరుత్మంతుడి వాహనంపై స్వామివారు

భద్రాచలం, ఏప్రిల్ 5: భద్రాచలంలో శ్రీసీతారాముల కల్యాణ మహోత్సవంలో కీలక ఘట్టమైన ఎదుర్కోలు వేడుక శనివారం రాత్రి ఆద్యంతం ఆసక్తికగా సాగింది. గరుత్మంతుడి వాహనంపై స్వామివారిని మిథిలా స్టేడియం ఎదురుగా ఉన్న వైకుంఠద్వారం వద్దకు తీసుకువచ్చి కొలువుదీర్చారు. అక్కడ 'మా వంశం గొప్పది.. లేదు.. మా వంశమే గొప్పది' అంటూ కొందరు అర్చకులు సీతమ్మ తరపున, మరికొందరు రామయ్య తరపున సంవాదం చేసుకోవడం ఆసక్తి కలిగించింది. శ్రీసీతారాముల వారి వైభవాన్ని లోకానికి తెలియచెప్పేందుకే ఎదుర్కోలు వేడుక నిర్వహిస్తున్నట్లు పండితులు ఉపదేశించారు. అనంతరం ఊరేగింపుగా స్వామి, అమ్మవార్లను ఆలయానికి తీసుకువెళ్లారు. ఆలయ ఈవో రమాదేవి, అధికారులు, వేదపండితులు పాల్గొన్నారు.












## జగ్జీవన్‌రామ్ జీవితం స్ఫూర్తిదాయకం

**మాజీ తొలి ఉప ప్రధాని జయంతి వేడుకల్లో వక్తలు**



బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



నివాళులర్పిస్తున్న కొత్తగూడెం కలెక్టర్, అధికారులు, నాయకులు

ఖమ్మం/ భద్రాచలం/ కొత్తగూడెం గణేశ్ టెంపుల్, ఏప్రిల్ 5: స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ జీవితం స్ఫూర్తిదాయకమని, దేశానికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని వక్తలు కొనియాడారు. జగ్జీవన్‌రామ్118వ జయంతి వేడుకలను ఉమ్మడి జిల్లావ్యాప్తంగా శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా కార్యక్రమాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. భద్రాద్రి ఐడీవోసీలో కలెక్టర్ జితేశ్ వి పాటిల్ మాట్లాడుతూ అత్యంత పేదరికంలో జన్మించిన ఆయన అకుంఠితదీక్షతో అత్యున్నత స్థానానికి ఎదిగారన్నారు. ఖమ్మం భక్త రామదాసు కళాక్షేత్రంలో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ మనం ఆశించే మార్పు మన ఇంటి నుంచే ప్రారంభించాలనే సూక్తిని బాబూ జగ్జీవన్‌రామ్ పాటించారని గుర్తుచేశారు. భద్రాచలం ఐటీడీఏలో పీవో రాహుల్ మాట్లాడుతూ బాబూ జగ్జీవన్‌రామ్‌ది అలుపెరగని పోరాటమని అన్నారు. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఖమ్మంలోని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళుర్పించారు. అనంతరం పార్టీ జిల్లా కార్యాలయంలోనూ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా పార్టీ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు మాట్లాడుతూ.. అణగారినవర్గాల అభ్యున్నతికి కృషిచేసిన మహోన్నత వ్యక్తి జగ్జీవన్‌రామ్ అని కొనియాడారు.




మాట్లాడుతున్న ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్








| Series | Months | Chit Value in Rs. | Max % | Discount Rs. | Prize Amount | Dividend | Instalment | Monthly Subsc. |
|---|---|---|---|---|---|---|---|---|
| SLF | 50 | 5,00,000 | 40% | 2,00,000 | 3,00,000 | 3,500 | 6,500 | 10,000 |
| SLFT | 50 | 10,00,000 | 40% | 4,00,000 | 6,00,000 | 7,000 | 13,000 | 20,000 |
| SLF2TF | 50 | 25,00,000 | 40% | 10,00,000 | 15,00,000 | 17,500 | 32,500 | 50,000 |
| SLF5T | 50 | 50,00,000 | 40% | 20,00,000 | 30,00,000 | 35,000 | 65,000 | 1,00,000 |
| SLF10T | 50 | 1,00,00,000 | 40% | 40,00,000 | 60,00,000 | 70,000 | 1,30,000 | 2,00,000 |





## ఉద్యోగుల సమస్యలపై సీఎం చొరవ చూపట్లేదు

- బకాయిల చెల్లింపులు, సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం
- ఏప్రిల్ 1 నుంచి దశల వారీ ఆందోళనలు.. మే 10న హైదరాబాద్‌లో మహాధర్నా
- టీజీఈ జేఏసీ రాష్ట్ర చైర్మన్, టీఎన్‌జీవో రాష్ట్ర అధ్యక్షుడు 'మారం'
- భద్రాద్రి జిల్లా పాల్వంచలో ఉద్యోగ సంఘాల జేఏసీ సమావేశం



సమావేశంలో అభివాదం చేస్తున్న టీజీఈ జేఏసీ రాష్ట్ర చైర్మన్ జగదీశ్వర్, టీఎన్‌జీవోస్ సంఘం నేతలు

పాల్వంచ, ఏప్రిల్ 5: ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై రాష్ట్రవ్యాప్తంగా ఐక్యంగా పోరాడతామని టీజీఈ జేఏసీ రాష్ట్ర చైర్మన్, టీఎన్‌జీవో రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్ తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ పట్టణంలోని సుగుణ గార్డెన్స్‌లో శనివారం జిల్లాస్థాయి ఉద్యోగ సంఘాల సమావేశం ఏర్పాటు చేశారు. ఆ తర్వాత మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలోని ఉద్యోగులకు రావాల్సిన బకాయిల విషయంలో కానీ, ఇతర సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. అధికారం చేపట్టి పదినెలలు గడుస్తున్నా ఇప్పటివరకు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడంలో సీఎం రేవంత్‌రెడ్డి చొరవ చూపడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందుల్లో ఉందని సీఎం పదే పదే చెబుతూ వస్తున్నారని పేర్కొన్నారు. జిల్లాల్లో ఏప్రిల్ 1 నుంచి 30వ తేదీ వరకు దశల వారీగా ఆందోళనలు చేపడతామని, మే 4వ తేదీన రాష్ట్రస్థాయి సదస్సు ఏర్పాటు చేస్తామని, మే 15వ తేదీన నిరసన కార్యక్రమాలు చేపడతామని వెల్లడించారు. ఆ తర్వాత జూన్ 10వ తేదీన హైదరాబాద్‌లో మహాధర్నా కార్యక్రమం చేపట్టేందుకు కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. సమావేశంలో రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాస్, బి.రాజు, అమరనేని రామారావు, కంచర్ల సాయి భార్గవ్ చైతన్య, పీఆర్‌టీయూ నుంచి రవి, రాజశేఖర్, సత్యనారాయణగౌడ్ పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న టీజీఈ జేఏసీ, టీఎన్‌జీవోస్ నాయకులు





